సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



అన్నదానానికి విరాళం

కపిలేశ్వరపురం:అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శాశ్వత అన్నదానానికి శనివారం మోటిపల్లి రామచంద్రరావు, కృష్ణవేణి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.25 వేల విరాళం అందజేశారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 7వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భద్రాచలం వద్ద 11.60అడుగులకు నీటి మట్టం చేరింది.

పాదగయ క్షేత్రంలో పిండ ప్రదానాలు



మహాలయ అమావాస్య సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రమైన పిఠాపురం పాదగయలో శనివారం పిండ ప్రదానాలు చేయడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాష్ట్రంలో శైవ క్షేత్రాల్లో ఒకటైన పాదగయకు ప్రత్యేకత ఉంది.

10లో

న్యూస్‌రీల్

రేపటి నుంచి ఎన్నికల యూనిట్ల తనిఖీలు

- ఎస్పీ జగదీష్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ మాధవీలత



తనిఖీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వచ్చే ఏడాది సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లాకు కేటాయించిన ఎన్నికల యూనిట్లను బెల్ సంస్థకు చెందిన సీనియర్ సాంకేతిక ఇంజినీర్ల ఆధ్వర్యంలో సోమవారం నుంచి పరిశీలన చేపట్టనున్నట్టు కలెక్టర్ మాధవీలత అన్నారు. ఈ మేరకు ఎఫ్‌సీఐ గోడౌన్‌లో మొదటి స్థాయి తనిఖీ కోసం చేసిన ఏర్పాట్లను ఎస్పీ జగదీష్‌తో కలిసి శనివారం ఆమె పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు చెందిన 5,971 బ్యాలెట్ యూనిట్లు, 5,463 కంట్రోల్ యూనిట్లు, 4,927 వీవీప్యాట్ యూనిట్లను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో తనిఖీ చేస్తారన్నారు. ఈ విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులు ఎవ్వరూ సెల్‌ఫోన్లు, ఇతర ఎల్రక్టానిక్స్ వస్తువులు తీసుకురాకూడదన్నారు. అత్యంత భద్రత మధ్య ఈ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకూ తనిఖీ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆమె వెంట డీఆర్వో జి.నరసింహులు, ఆర్డీవో ఎఫ్ఎల్‌సీ ఇన్‌చార్జి ఏ.చైత్రవర్షిణి ఉన్నారు.

పొగాకు అధిక సాగుతో ఇబ్బందులు పడవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం ఆదిశేషయ్య

గోపాలపురం: పొగాకు బ్యారన్‌కు 35 క్వింటాళ్ల మాత్రమే ఉత్పత్తి చేయాలని రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎం ఆదిశేషయ్య సూచించారు. ఒక్కో రైతు నాలుగు ఎకరాలలో సాగు చేయాలన్నారు. అధికంగా సాగు చేసి ఇబ్బందులకు గురికావద్దన్నారు. గోపాలపురం పొగాకు వేలం కేంద్రం వద్ద శనివారం వేలం నిర్వాహణాధికారి అమ్మ్యూల్ శ్యామ్ అధ్యక్షతన దేవరపల్లి, గోపాలపురం మండల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్ఎం ఆదిశేషయ్య మాట్లాడుతూ పొగాకు బోర్డు నిర్దేశించిన ప్రకారం పొగాకు ఉత్పత్తి చేయాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి చూపాలన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా పొగాకు ఉత్పత్తి ఉండాలన్నారు.

కొంచెం ఓపిక చాలు





- ఆస్పత్రి ఓపీ క్యూలో కాలహరణానికి చెక్
- 'అభా'తో ప్రభుత్వాస్పత్రుల్లో ఆన్‌లైన్ సేవలు
- పూర్తి స్థాయి వినియోగంలో రోగుల వెనకడుగు
- అవగాహన కల్పనలో వైద్యాధికారుల నిర్లక్ష్యం
- రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో రోజుకు 800 మంది ఔట్ పేషెంట్లకు వైద్యం



రాజమండ్రి జీజీహెచ్‌లో ఓపీ కోసం క్యూ కట్టిన రోగులు

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవుట్ పేషెంట్ (ఓపీ) సేవలు సులభతరం చేసేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి తెచ్చింది. గంటల తరబడి క్యూలో నిల్చొని టోకెన్ పొందే విధానాన్ని చెక్ పెట్టేందు శ్రీకారం చుట్టింది. డిజిటలైజేషన్‌లో భాగంగా అభా(ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) యాప్‌లో రోగి వివరాలను నమోదు చేసి వైద్యం పొందే సేవలు ఇటీవల జీజీహెచ్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రారంభమయ్యాయి. యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసి డాక్టర్ అపాయింట్‌మెంట్‌కు టోకెన్ పొందే విధానం అందుబాటులోకి వచ్చింది. అయితే ఇది మేలు చేకూరుస్తున్నా అవగాహన లేక కొందరు రోగులు వినియోగించుకోలేకపోతున్నారు. యాప్ వినియోగంపై రోగులకు అవగాహన కల్పించాల్సిన వైద్యాధికారులు పట్టించుకోకపోవడంతో సేవలు ప్రాచుర్యం పొందడం లేదు. యాప్‌పై ఇప్పటికే ఆస్పత్రిలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఓపీ రిజిస్ట్రేషన్ ఎలా చేసుకోవాలన్న విషయమై అవగాహన కల్పించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ఎక్కడా దర్శనమివ్వడం లేదు. యాప్‌పై అవగాహన ఉన్న వారు నిమిషాల వ్యవధిలో వైద్య సేవలు పొందుతుంటే.. తెలియని వారు వాళ్ల దగ్గరికి, వీళ్ల దగ్గరికి తిరగాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి.

ఎంతో ప్రయోజనం

దేశ వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం పొందే రోగుల వివరాలను 'నేషనల్ హెల్త్ రికార్డ్స్'లో పొందుపరిచేందుకు ఆన్‌లైన్ అవుట్ పేషంట్ (ఓపీ) విధానాన్ని కేంద్రం విస్తరిస్తోంది. తద్వారా క్యూలో నిల్చోకుండా సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెళితే తొలుత ఓపీ కౌంటర్‌లో వివరాలను నమోదు చేసుకోవాలి. రోగి పేరు, చిరునామా, ఫోన్ నంబర్ ఇతర వ్యక్తిగత వివరాలను వెల్లడించాలి. అనంతరం రోగి వైద్య సేవలు పొందాలనుకున్న విభాగానికి సంబంధించి ఓపీ టికెట్ ఇస్తారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు కనీసం 5 నుంచి 10 నిమిషాల సమయం పడుతుంది. ఫలితంగా రోగులు గంటల తరబడి క్యూలో పడిగాపులు కాయాల్సి వస్తోంది. దీన్ని అధిగమించేందుకు ఆన్‌లైన్ ఓపీని పరిచయం చేస్తున్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా ఓపీ రిజిస్ట్రేషన్ చేసుకుంటే నేరుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌కు వెళ్లి టోకెన్ తీసుకుని డాక్టర్‌ను సంప్రదించవచ్చు. క్యూలో నిరీక్షించే అగచాట్లు తప్పుతాయి.

యాప్‌లో ఇలా నమోదవ్వాలి

- స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్‌కు వెళ్లాలి. ఏబీహెచ్‌ఏ (అభా) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఆయుష్మాన్ డిజిటల్ హెల్త్ అకౌంట్(అభా) 14 అంకెల గుర్తింపు/ఫోన్ నంబర్/ ఐడీ ద్వారా యాప్‌లో రిజిస్టర్ అవ్వాలి.
- యాప్‌లోకి లాగినయితే 'అభా' వివరాలు కనిపిస్తాయి. వీటిని ఆస్పత్రిలో షేర్ చేసే ఆప్షన్ దర్శనమిస్తుంది. షేర్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే టోకెన్ నంబర్ వస్తుంది. టోకెన్‌కు 30 నిమిషాల వ్యాలిడిటీ ఉంటుంది.
- టోకెన్ నంబర్ వచ్చిన వెంటనే ఆస్పత్రిలో కౌంటర్‌కు వెళ్లి అభా గుర్తింపు నంబర్, ఫోన్ నెంబర్ తెలియజేయాలి. ఏ స్పెషాలిటీలో ఓపీ అవసరమో చెబితే వైద్య సిబ్బంది చీటీ ఇస్తారు. చీటీ తీసుకుని నేరుగా డాక్టర్‌ను సంప్రదించవచ్చు. ఇదంతా రెండు నిమిషాల ప్రక్రియ. ఒక వేళ నెట్‌వర్క్ సమస్య ఉంటే కొంత టైమ్ పడుతుంది.
- ఆస్పత్రికి వెళ్లే ముందే ఇంటి వద్ద యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే ఓపీ కౌంటర్ వద్ద పని సులువు అవుతుంది. ఒకసారి యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు.. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు పొందవచ్చు.
- ఈ విధానంపై అవగాహన కల్పించేందుకు ఓపీ కౌంటర్ల వద్ద వైద్య సిబ్బంది ఉంటారు.
- ప్రస్తుతం పాద పద్ధతిలో ఓపీ చీటీలు ఇస్తూనే సమాంతరంగా అభా విధానాన్ని అమలు చేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ లేనివారు సిబ్బందిని సంప్రదిస్తే ఓపీ చీటీ ఇస్తున్నారు.

రాజమహేంద్రవరంలో సేవలు ఇలా..

కాకినాడ అనంతరం రాజమహేంద్రవరం బోధనాస్పత్రి (జీజీహెచ్)కు ప్రాధాన్యత ఉంది. కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి కూడా రోగులు ఇక్కడికి వచ్చి వైద్య సేవలు పొందుతుంటారు. రోజూ 600 నుంచి 800లకు పైగా ఔట్ పేషెంట్లు(ఓపీ) వస్తుంటారు. 500 పడకల బోధనాస్పత్రిగా అభివృద్ధి చెందాక జీజీహెచ్ 13 విభాగాల్లో వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు అందజేస్తోంది. ప్రధానంగా మాతాశిశు, యాక్సిడెంట్ కేసులకు వైద్యం అందించడంలో కీలక భూమిక పోషిస్తోంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, గంట వ్యవధి అనంతరం తిరిగి 3 నుంచి 4 గంటల వరకు ఓపీ సేవలు అందుబాటులో ఉంటున్నాయి. రాత్రి పూట సైతం అత్యవసర ఓపీ నడుస్తోంది. సోమవారం, బుధవారం, గురువారాల్లో రోగుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. 6 కౌంటర్ల ద్వారా ఓపీ ఇస్తున్నారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా కౌంటర్లు నిర్వహిస్తున్నారు. 200 మంది ఇన్‌పేషెంట్లు ఉంటున్నారు. ఓపీ చీటీల జారీలో సమస్యలు తలెత్తుతున్నాయి. కొత్త విధానం ద్వారా ఓపీ తీసుకురావాలని రోగులకు చెబుతుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేసేది లేక తమకు తెలిసిన వాళ్ల మొబైల్ తీసుకుని నమోదు చేసుకుని వస్తున్నారు. స్మార్ట్ ఫోన్ లేనివారి కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. వీటన్నింటినీ అధిగమించాలంటే ఆస్పత్రిలో ప్రత్యేకంగా వైద్యులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. విధానంపై అవగాహన లేనివారు అక్కడే ఉన్న వైద్య సిబ్బందిని సంప్రదిస్తే వారు తగిన సూచనలు ఇవ్వడం లేదన్న ఆరోపణలున్నాయి.

ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి



వైద్యం కోసం వచ్చే ప్రతి ఒక్కరూ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఒకసారి డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు.. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు పొందవచ్చు. రోగులకు అవగాహన కల్పించేందుకు సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. కౌంటర్ల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. ఎలాంటి సందేహాలున్నా వారిని సంప్రదిస్తే పరిష్కరిస్తారు. యాప్‌పై ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌లో రోగి పేరు నమోదు కావడం వల్ల రూ.5 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. ఆశ, ఏఎన్ఎంలను సంప్రదించినా అభాలో పేర్లు నమోదు చేస్తారు.

– డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, సూపరింటెండెంట్, జీజీహెచ్

వైద్య రంగంలో సంస్కరణలు

హోం మంత్రి తానేటి వనిత



బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన హోం మంత్రి వనిత

తాళ్లపూడి: పేదలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని మలకపల్లి గ్రామంలో నిర్మించే బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనానికి శనివారం మంత్రి వనిత శంకుస్థాపన చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మిస్తారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ వైద్య రంగంలో ఇప్పటికే ముఖ్యమంత్రి జగనన్న ఎన్నో మార్పులు తీసుకొచ్చారన్నారు. మలకపల్లిలో నిర్మించే బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌లో ఒక అత్యాధునిక ల్యాబ్, అడ్మినిస్ట్రేటివ్ భవనం ఉంటాయన్నారు. కొవ్వూరు డివిజన్‌లోని అన్ని పీహెచ్‌సీలకు సంబంధించిన ఆరోగ్య విషయాలనూ ఈ యూనిట్ నుంచి మానిటరింగ్ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ రాపాక రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గౌడ, శెట్టిబలిజ సామాజిక వర్గీయులకు అగ్రాసనం

వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి



సమావేశంలో ఎంపీలు మిథున్‌రెడ్డి, బోస్, భరత్‌రామ్, మంత్రి వేణు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

రాజమహేంద్రవరం సిటీ: గౌడ, శెట్టిబలిజ సామాజిక వర్గీయులకు వివిధ పదవుల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇచ్చారని వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి చెప్పారు. రాజమహేంద్రవరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఆయన శెట్టిబలిజ, గౌడ నాయకులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు రాజ్యసభలో, కుడుపూడి సూర్యనారాయణరావు, కవురు శ్రీనివాసరావులకు సీఎం శాసన మండలిలో పదవులు ఇచ్చారన్నారు. గౌడ సామాజిక వర్గానికి చెందిన మార్గాని భరత్‌రామ్‌కు లోక్‌సభ సభ్యునిగా అవకాశం కల్పించారన్నారు. చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను మంత్రిని చేశారని వివరించారు. శెట్టిబలిజ సామాజిక వర్గీయుల భవిష్యత్ కోసం జగన్ అనేక సంక్షేమ పథకాల రూపంలో సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. సీనియర్ నాయకుడు పాలిక శ్రీను మాట్లాడుతూ ఎంపీ భరత్‌రామ్ సహకారంతో ప్రతి గ్రామంలో శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు అనుమతి ఇప్పించాలని కోరారు. గౌడ శెట్టిబలిజ వర్గీయులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించినందుకు ఈ జాతి వైఎస్సార్ సీపీకి రుణపడి ఉంటుందన్నారు. పార్లమెంట్ పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు, రాష్ట్రంలో నాలుగు పార్లమెంట్ స్థానాలను కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, రాజమహేంద్రవరం సిటీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాసరావు, వాసంశెట్టి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

బ్లేడ్ బ్యాచ్, రౌడీషీటర్లపై ఉక్కుపాదం

- 374 మంది బైండోవర్
- నలుగురిపై పీడీ యాక్ట్ అమలు



జగదీష్, ఎస్పీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తూ, ప్రజలను దోపిడీ చేస్తున్న బ్లేడ్ బ్యాచ్, రౌడీషీటర్లపై జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఉక్కుపాదం మోపారు. ఇటీవల జరుగుతున్న వరుస సంఘటనల నేపథ్యంలో వారిపై దృష్టి సారించారు. ప్రజలను భయపెడుతూ, చట్టాలను ఉల్లంఘిస్తూ తిరుగుతున్న 374 మందిని బైండోవర్ చేశారు. జిల్లాలో శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న నలుగురిపై పీడీ యాక్ట్ అమలు చేసే దిశగా కలెక్టర్ మాధవీలతకు ఎస్పీ ఆ వివరాలు నివేదించారు. ఆమె వాటిని పరిశీలించి వారిపై పీడీ యాక్ట్ అమలు పరుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

ప్రజాశాంతికి భంగం కలిగిస్తూ, ప్రజారోగ్యాన్ని పాడు చేసే వ్యాపారాలు చేస్తున్న వారిపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తున్నామని ఎస్పీ జగదీష్ శనివారం ప్రకటన విడుదల చేశారు. వారి ఆగడాలకు కళ్లెం వేయడానికి, వారి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం ప్రయోగిస్తున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న యాక్టివ్ రౌడీషీటర్లు, బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి, సారా అక్రమ రవాణా, విక్రయాలు సాగిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాజమహేంద్రవరంలోని వీరభద్రనగర్‌కు చెందిన తుపాకుల ఆలీబాబా (7 క్రిమినల్ కేసులు), బొగ్గుల దిబ్బకు చెందిన టేకుమూడి దుర్గాప్రసాద్ (13 క్రిమినల్ కేసులు), రాజమహేంద్రవరం రూరల్ మండలం పాత బొమ్మూరుకు చెందిన వాసంశెట్టి దుర్గాప్రసాద్ (8 క్రిమినల్ కేసులు), ధవళేశ్వరంలో బ్యారేజీ లాక్‌లైన్‌కు చెందిన సింగంపల్లి కార్తికేయ (4 క్రిమినల్ కేసులు)పై పీడీ యాక్ట్ అమలు చేశామన్నారు.

సౌత్ జోన్ బాలికల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: విలువైన సమయంలో కొంత క్రీడలకు కేటాయించి వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె. పద్మరాజు విద్యార్థులకు సూచించారు. దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో మూడు రోజుల పాటు జరిగే సీబీఎస్ఈ సౌత్ జోన్ బాలికల ఫుట్‌బాల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో పాల్గొనడం ద్వారా శరీర దృఢత్వంతోపాటు మానసిక ఉత్తేజం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యానికేతన్ సహాయ కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కేలం శ్రీనివాస్, పరిశీలకులు ఎస్. గంగాధరం, ప్రిన్సిపాల్స్ ఎంవీవీఎస్ మూర్తి, ఏఎస్ఎన్ మూర్తి, అకాడమీ కోఆర్డినేటర్ ఎం. విమల, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

32 సీబీఎస్ఈ స్కూళ్ల నుంచి 532 మంది క్రీడాకారులు

ఈ పోటీలకు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలలోని 32 సీబీఎస్ఈ స్కూళ్ల నుంచి 532 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, కడప జిల్లాల జాతీయ స్థాయి రిఫరీల ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ పోటీలను నిర్వహిస్తున్నారు. మొదటిరోజు జరిగిన పోటీలలో పీఎస్ఎస్ సెకండరీ స్కూల్ (తమిళనాడు), లలాజీ మెమోరియల్ స్కూల్ (తమిళనాడు), బీటీఏ స్కూల్ (తమిళనాడు), జవహర్ హైయర్ స్కూల్ (తమిళనాడు), చిన్మయ విద్యాలయం స్కూల్ (హైదరాబాద్) విజయం సాధించాయి.

అమ్మ సంబరం.. అంగరంగ వైభవం



రాజమహేంద్రవరంలోని దేవీచౌక్‌లో ఏర్పాటు చేసిన వేదికపై శనివారం రాత్రి 9.36 గంటలకు అమ్మవారిని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో బత్తుల రాజరాజేశ్వరరావు, ఆకుల వెంకటేశ్వరరావు, పడాల కోటేశ్వరరావు, బత్తుల ఈశ్వరరావు, భైరవస్వామి పాల్గొన్నారు.

భారీగా చిక్కిన టేకు చేపలు


మత్స్యకారులకు చిక్కిన టేకు చేపలు

కాకినాడ రూరల్: సముద్రంలో టేకు చేపలు అరుదుగా లభిస్తుంటాయి. కాకినాడ కుంభాభిషేకం వద్ద మత్స్యకారుల వలకు శనివారం ఇవి భారీగా చిక్కాయి. సాధారణంగా 5 కిలోల నుంచి 30 కిలోల వరకూ లభ్యమయ్యే ఈ టేకు చేపలు 50 కిలోల బరువు ఉండటం విశేషం. వీటిని హౌరాలో విక్రయించేందుకు ఓ వ్యాపారి కొనుగోలు చేశారు. కిలో రూ.120 నుంచి రూ.160 వరకూ ధర పలికింది.

కౌశల్ క్విజ్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కౌశల్ 2023 క్విజ్ పోటీలను విజయవంతం చేయాలని కాకినాడ డీఈఓ జి.నాగమణి సూచించారు. శనివారం స్థానికంగా తన చాంబర్‌లో క్విజ్ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ ఈ పోటీల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని 8 నుంచి 10వ తరగతుల విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలు నవంబర్ 5వ తేదీలోగా నమోదు చేసుకోవాలని, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతితో పాటు రాష్ట్ర స్థాయి ప్రతిభావంతులకు గవర్నర్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినిల్, బాలల సైన్స్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


కౌశల్ క్విజ్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాకినాడ జిల్లా డీఈఓ నాగమణి తదితరులు

పాదగయ క్షేత్రంలో
పిండ ప్రదానాలు

భారీగా తరలివచ్చిన జనం

పిఠాపురం: మహాలయ అమావాస్య సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రమైన పిఠాపురం పాదగయలో శనివారం పిండ ప్రదానాలు చేయడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాష్ట్రంలో శైవ క్షేత్రాల్లో ఒకటైన పాదగయకు ప్రత్యేకత ఉంది. గోదావరి పుష్కర కాలంలో విశేషంగా ఒడిశా రాష్ట్రం నుంచి ఒడ్డర్లు కనీసం ఇంటికి ఒకరైనా వచ్చి రాజమహేంద్రవరం గోదావరిలో స్నానం మాత్రమే చేసి పిఠాపురంలో ఈ పాదగయ క్షేత్రంలో పిండ ప్రదానం చేయడం తరతరాలుగా ఆచారంగా వస్తుంది. ఇక్కడ చేసే పిండ ప్రదానం నేరుగా గయాసురుని పాదాల ద్వారా పితృ దేవతలకు చేరుతుందనే నానుడి ఉండడంతో దేశ విదేశాల నుంచి భక్తులు ఇక్కడకు పిండ ప్రదానాలు చేయడానికి వస్తుంటారు. దీంతో మహాలయ అమావాస్య సందర్భంగా పాదగయ క్షేత్రంలో శనివారం ఒక్క రోజే సుమారు 2 వేల మంది పిండ ప్రదానాలు జరిగాయని అధికారులు తెలిపారు. ఈ మేరకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


పాదగయలో పిండ ప్రదానాలకు వచ్చిన భక్తులు

కవల కపిల దూడల జననం


కవల కపిల దూడలతో రైతు వెంకట్రావు

రాయవరం: సాధారణంగా ఆవు లేకుంటే, గేదెకు ఒక దూడ జన్మించడం జరుగుతుంది. రాయవరం మండలం లొల్ల గ్రామానికి చెందిన రైతు బులుసు వెంకట్రావుకు చెందిన ఆవు ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. ఒంగోలు జాతికి చెందిన ఈ ఆవుకు రెండు కపిల గిత్తలు జన్మించడం పట్ల రైతు వెంకట్రావు ఆనందానికి అవధులు లేవు. కపిల గిత్తలను చూసేందుకు పలువురు ఆసక్తిగా తరలివచ్చారు. సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చేవా సత్యనారాయణ తదితరులు కపిల దూడలను పరిశీలించారు.

కాలువలో పడి యువకుడి మృతి


జుత్తిగ పోశియ్య మృతదేహం

గోపాలపురం: తాడిపూడి కాలువలో పడి ఓ యువకుడు మృతి చెందినట్లు ఏఎస్సై కె.శోభనాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన జుత్తిగ పోశియ్య (30) తన స్నేహితులతో కలసి గోపాలపురం మండలం పెద్దాపురం తాడిపూడి కాలువలో ఈత కొట్టడానికి వెళ్లాడు. రెండు సార్లు గట్టుపై నుంచి కాలువలోకి దూకాడు. మూడోసారి దూకిన పోశియ్య కాలువలో కొట్టుకుపోయాడు. గజ ఈతగాళ్ల సాయంతో పోశియ్య మృతదేహాన్ని బయటకు తీయించినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. అతని అన్నయ్య హరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.